క్లుప్తంగా

పరామర్శ



సాంబమూర్తిరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలం కోనూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, వైస్ ఎంపీపీ రామకృష్ణరాజు చిన్నాన్న సాంబమూర్తిరాజు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్ బాబు), పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు శనివారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సాంబమూర్తిరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రేగాన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



హైస్కూల్‌లో మొక్క నాటుతున్న జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు

బొండపల్లి: విరివిగా మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని జిల్లా పంచాయతీ అధికారి డి.మల్లికార్జునరావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఎ.రఘుపతిరావు, ఎంఈఓ -2 అల్లు వెంకటరమణ, సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, హెచ్‌ఎం ఉమా మహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో వర్మీకంపోస్టు ఎరువు

- డీపీఓ మల్లికార్జునరావు

గజపతినగరం: ఇళ్ల నుంచి సేకరిస్తున్న తడి, పొడి చెత్తతో వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయాలని డీపీఓ డి. మల్లికార్జునరావు అన్నారు. శనివారం స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీలో సీఆర్‌పీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చెత్త నుంచి సంపద ఎలా సృష్టించవచ్చో వివరించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.కల్యాణి, సర్పంచ్ నరవ కొండమ్మ, పంచాయతీ ఈఓ జనార్దనరావు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు జామి విద్యార్థులు

జామి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శేఖర్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీల్లో రాణించారన్నారు. డివిజన్ స్థాయి పోటీల్లో కూడా రాణించి, పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేఖర్‌బాబు, పీడీలు ఆనంద్, ఎర్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మా గోడు వినండి సారూ...



వివాదాస్పద స్థలంలో జేసీబీతో ఇళ్లను, షాపులను కూల్చేస్తున్న దృశ్యం

లక్కవరపుకోట: ఎల్.కోట మండలం మల్లివీడు రెవెన్యూ పరిధి గోల్డుస్టార్ కూడలి సమీపంలో సర్వే నంబర్ 36-4సిలో ఉన్న 30 సెంట్లు భూమి విషయంలో ఏళ్ల తరబడి వివాదం నడుస్తోంది... కోర్టు తీర్పు గేదెల అప్పన్నదొర కుటుంబానికి అనుకూలంగా ఇచ్చిందే తప్ప భూమిని అప్పగించమని ఇవ్వలేదని... మా గోడు వినకుండా ఉన్నఫళంగా దుకాణాలు, ఇళ్లను నేలమట్టం చేసి భూమిని అప్పగించేయడం తగదంటూ రెల్లిగౌరమ్మపేటకు చెందిన పినిశెట్టి కిష్టప్పదొర కుటుంబ సభ్యులు స్థానిక విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. పోలీసులు బలవంతంగా తమను స్టేషన్‌కు తరలించారని, తమ గోడు చెప్పినా వినిపించుకోలేదంటూ వాపోయారు. ఇదే విషయంపై సీఐ అప్పలనాయుడు వివరణ ఇస్తూ కోర్టు తీర్పు అమలు చేయడం తమ బాధ్యత అని తెలియజేశారు.

ఘనంగా చెకుముకి పోటీలు

మెరకముడిదాం: మండలంలోని తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోనూ, కేజీబీవీ, గర్భాం ఏపీ మోడల్‌స్కూల్‌లోనూ జన విజ్ఞాన వేదిక సభ్యులు శనివారం చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 8,9,10 తరగతులకు సంబంధించి 1100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యకర్మంలో జనవిజ్ఞాన వేదిక సభ్యులు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.రఘునాథరాజు, మండల సింహాద్రి, మండల వెంకటచిన అప్పలనాయుడు, భూపతి, బి.నవీన్, ఎం.రమణ పాల్గొన్నారు.



బస్టాండ్ ఆవరణలో పిచ్చిమొక్కలు, (ఇన్‌సెట్లో) శిథిలావస్థలో బస్ షెల్టర్ భవనం

- శిథిలావస్థకు చేరుకున్న వేపాడ బస్ కాంప్లెక్స్ భవనం
- ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు
- దుకాణాల వద్ద ప్రయాణికుల నిరీక్షణ
- కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలంటున్న ప్రజలు

నిరుపయోగం..

వేపాడ:

జిల్లాలో వెనుకబడిన మండలం ఏదైనా ఉందంటే ఠక్కున గుర్తుకువచ్చేది వేపాడే. మండల కేంద్రంలో 23 ఏళ్ల కిందట నిర్మించిన కాంప్లెక్స్ భవనం నిరుపయోగంగా మారింది. దీంతో ప్రయాణికులు బస్సులు, ఆటోల కోసం రోడ్డుమీదుండే దుకాణాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మండల పరిధిలోని 20 పంచాయతీల్లో 55 వేలకు పైగా జనాభా ఉన్నారు. అయితే మండలం మాత్రం ఎటువంటి అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ముఖ్యంగా బస్సు కాంప్లెక్స్ అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రమైన విజయనగరానికి గాని అనకాపల్లి, చోడవరం, విశాఖకు గాని బస్సు సౌకర్యం లేదు. పల్లెవెలుగు బస్సులు లేని మండలం ఏదైనా ఉందంటే అది వేపాడే అని చెప్పుకోవాలి.

23 ఏళ్ల నాటిది..

మండల కేంద్రంలో 2023 ఆగస్టులో ఆర్టీసీ బస్టాండ్ భవనం నిర్మించారు. అప్పట్లో వేపాడ మీదుగా కాకినాడ, అనకాపల్లి, చోడవరం, ఆనందపురం బస్సులు నడిచేవి. నాడు నిర్మించిన భవనం నేడు నిరుపయోగంగా మారినా అధికారుల్లో చలనం లేదు. భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం వెనుక ఉన్న విశాలమైన స్థలంలో పిచ్చిమొక్కలు మొలవడంతో స్థానికులు బహిర్భూమిగా వినియోగిస్తున్నారు. అలాగే ఖాళీ స్థలానికి ఆనుకుని ఐకేపీ, ఉపాధి కార్యాలయాలున్నాయి. ఆయా కార్యాలయాల సిబ్బందితో పాటు సమీప ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సైతం విష సర్పాల సంచారంతో భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి బస్ షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకురావడంతో పాటు ఖాళీ స్థలాన్ని చదునుచేసి నైట్‌హాల్ట్ బస్సులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి..



శిథిల భవనానికి మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలి. అలాగే చెత్తాచెదారాలతో నిండిపోయిన ఆవరణను శుభ్రం చేయాలి.

– ఏదువాక సన్యాసిరావు, వీలుపర్తి, వేపాడ మండలం

బస్సు సౌకర్యం కల్పించండి



జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించండి. స్త్రీ శక్తి పథకం అమలు చేస్తున్నా బస్సుల్లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వివిధ ప్రాంతాలకు బస్సులు నడపాలి.

– గొర్లె సత్యవతి, గృహిణి, వేపాడ

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి..



జామి: తహసీల్దార్ కృష్ణంరాజుకు వినతిపత్రం అందజేస్తున్న మండల విలేకరులు

జామి: పత్రికా స్వేచ్ఛను కాపాడాలని జామి మండల విలేకరులు డిమాండ్ చేశారు. సాక్షి పత్రికపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిని కూటమి ప్రభుత్వం కావాలనే ఇబ్బంది పెడుతోందన్నారు. వ్యతిరేక కథనాలు ప్రచురిస్తున్నారనే కారణంతో పోలీసుల సహాయంతో ఇబ్బంది పెట్టడం సరికాదని హితవు పలికారు. అనంతరం తహసీల్దార్ కృష్ణంరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు నార్ల మహంతి సన్యాసిరావు, రంభ ఎర్ని వెంకటరమణ, ఎం.జనార్దనరావు, దుక్క రాము, పసుమర్తి శ్రీను, కె.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి

- సివిల్ జడ్జి విజయ్‌రాజ్‌కుమార్



బీసీ బాలుర వసతిగృహంలో మాట్లాడుతున్న జడ్జి ఎ.విజయ్ రాజ్‌కుమార్

గజపతినగరం: వసతిగృహ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి కష్టపడి చదువుకోవాలని స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జి ఎ. విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని దిగువవీధిలో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతిగృహం, వెనుకబడిబడిన తరగతుల బీసీ బాలుర వసతిగృహం, బాలసదన్ వసతిగృహాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవనాల్లో విద్యుత్, తాగునీరు, తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. బాగా చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ బాలుర వసతిగృహం వార్డెన్ శ్రీధర్, బాలసదన్ వసతిగృహ సంక్షేమాధికారి సంధ్యతో పాటు న్యాయవాదులు సూర్యనారాయణ, సాయిశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్యాయం



తాటిపూడిలో కోటి సంతకాల సేకరణ పోస్టర్లను అవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం వల్ల పేదలకు అన్యాయం జరుగుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు అన్నారు. ప్రభుత్వం తీరును ఖండిస్తూ మండలంలోని వల్లాపురం, తాటిపూడి, గొలగాం, రాగోలు గ్రామాల్లో శనివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం తీరును వివరించారు. అనంతరం కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన బంగారునాయుడు, బోళ్ల సుబ్రహ్మణ్యం, కలిశెట్టి అప్పలరాజు, తాడేల ప్రభాకరరావు, మురళి, పాల్గొన్నారు.

దాచుకోవడం.. దోచుకోవడమే కూటమి నాయకుల తీరు

- మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య, మాజీ ఎంపీ చంద్రశేఖర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

బొండపల్లి: కూటమి నాయకులు దాచుకోవడం, దోచుకోవడమే పరమావధిగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆరోపించారు. మండలంలోని గొట్లాంలో గల సత్య ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ అంటూ కల్లబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. ఏడాదిన్నర కాలంలో ఒక్క పథకం సక్రమంగా అమలు చేయకపోగా సుమారు 1.86 లక్షల కోట్ల అప్పు చేసిందని ఆరోపించారు. విద్య, వైద్య రంగాలను పూర్తిగా నిర్వర్యం చేసిందని మండిపడ్డారు. జిల్లాలో ఈ ఏడాదిన్నర కాలంలో ఒక్క అభివృద్ధి పని అయినా చేశారా అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. ఇటీవల విజయనగరంలో నిర్వహించిన పైడితల్లి ఉత్సవాలకు సుమారు నాలుగు కోట్ల రూపాయల విరాళాలు సేకరించారని.. చందాలతో ఉత్సవాలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 45 వేల వరకు సంతకాలు సేకరించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని నవంబర్ 22 నాటికల్లా పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రతి గ్రామంలో కూడా వివిధ విభాగాలకు సంబంధించి ఎనిమిది కమిటీలను ఏర్పాటు చేసి వివరాలను జిల్లా కమిటీకి తెలియజేయాలని సూచించారు. వారికి గుర్తింపుకార్డులతో పాటు బీమా సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ జి.ఈశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, కె.సత్యారావు, బండారు బంగారం, మహంతి రమణ, సాలాపు పెంటంనాయుడు, బోడసింగి జగదీశ్వరరావు, మూకల చలంనాయుడు, పల్లి రఘు, మీసాల రాజేష్, గణేష్, కర్రోతు శ్రీనివాసరావు, సిరిపురం ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నియామకాలు..

దత్తిరాజేరు: గజపతినగరం నియోజకవర్గానికి సంబంధించి మండల కమిటీలను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దత్తిరాజేరు మండలానికి సంబంధించి ఉపాధ్యక్షులుగా చలమూరి సన్యాసిరావు, తాడ్డి చిరంజీవి.. జనరల్ సెక్రటరీలుగా ఆవుగడ్డ మురార్జీ, సాలాపు పాపారావు, మజ్జి అప్పలనాయుడు, కోడి బాబ్జీ.. సెక్రటరీలుగా కొల్లి తిరుపతి, మరిపి శంకర్, ఈదుబిల్లి ఎర్రినాయుడు, గొరగు కళ, మహదేవ్ వాసుదేవరావు నియమితులయ్యారు. గజపతినగరం ఉపాధ్యక్షులుగా కర్రి నానాజీ, బైరెడ్డి శ్రీను.. జనరల్ సెక్రటరీలుగా ఆల్తి రామునాయుడు, మీసాల సన్యాసినాయుడు, సెక్రటరీగా గేదెల రమాదేవి.. ట్రెజరర్‌గా గేదెల సన్యాసిరావు.. సెక్రటరీలుగా గొర్లె సత్యం అప్పలనాయుడు, ఇజ్జరోతు వెంకటరమణ, గరుగుబిల్లి కుమారి, లోగిశ బంగారునాయుడు, బెల్లాన అప్పలనాయుడు.. గంట్యాడ మండల ఉపాధ్యక్షులుగా వర్రి మల్లునాయుడు, చౌదవాడ రామసూర్యం.. జనరల్ సెక్రటరీలుగా పీరుబండి పద్మావతి, కరక మహేశ్వరరావు, బీల గంగునాయుడు, గేదెల సత్యారావు.. సెక్రటరీలుగా చప్ప సన్యాసినాయుడు, కొల్లి సూర్యారావు, పతివాడ భాస్కరరావు, కంచాడ నాయుడుతాత, లెంక మోహనరావు.. బొండపల్లి మండల ఉపాధ్యక్షులుగా తాళ్లపూడి అప్పలనాయుడు, దాసరి శివప్రసాద్.. జనరల్ సెక్రటరీలుగా మన్మథరావు, సిరిపురపు జామినాయుడు, వేమలి వెంకటరావు.. ట్రెజరర్‌గా సిరిపురపు నాయుడుబాబు.. సెక్రటరీలుగా బోగారపు శ్రీనివాసరావు, కోల వెంకటరమణ, తాడ్డి ప్రకాష్, లెంక రమణ, గొల్లు సతీష్‌లను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ప్రజా సమస్యలు గాలికి..

శృంగవరపుకోట: ప్రజలకు జవాబుదారీతనం వహించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారని ఎమ్మెల్సీ రఘురాజు ఆరోపించారు. మండలంలో ముషిడిపల్లి గ్రామ సచివాలయంలో నిర్వహించిన ప్రజాసమీక్షకు హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రజాసమస్యలను సమీక్షించి, వాటిని పరిష్కరించాల్సిన అధికారులు సక్రమంగా పట్టించుకోవడం లేదన్నారు. జిందాల్ కంపెనీ రైతులకు తెలియకుండా భూములు స్వాహా చేస్తోందని, రైతులు పోరాటం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవటం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని కోరారు.

90 శాతం రాయితీపై పరికరాలు

వేపాడ: సన్న, చిన్నకారు రైతులకు బిందు, తుంపర సేద్యం యూనిట్‌లను 90 శాతం రాయితీపై మంజూరు చేయనున్నట్లు ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని వీలుపర్తి పంచాయతీలో మంజూరు చేసిన యూనిట్‌లను శనివారం ఆయన పరిశీలించారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి తగదు



ఎస్.కోటలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రిపోర్టర్లు

శృంగవరపుకోట: పత్రికా స్వేచ్ఛపై దాడి తగదని మండల పాత్రికేయులు అభిప్రాయపడ్డారు. సాక్షి ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ జర్నలిస్టులు శనివారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాశారన్న అక్కసుతో రిపోర్టర్ల ఇళ్లలో పోలీసులు చొరబడి, సోదాల పేరుతో భయపెట్టడం సరికాదన్నారు. ప్రజారక్షణే కర్తవ్యంగా పనిచేయాల్సిన పోలీసులు రాజ్యాంగాన్ని వదిలేసి ప్రభుత్వానికి దాసోహమవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు పాల్గొన్నారు.

దాడులు తగవు..



రౌతు రాజేశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు

దత్తిరాజేరు: ప్రజల పక్షాన నిలిచి నిజాయితీగా వార్తలు రాస్తున్న పాత్రికేయులపై కూటమి ప్రభుత్వం దాడులు చేయించడం తగదని జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. కల్తీ మద్యంపై కథనాలు ప్రచురిస్తూ, ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తున్న సాక్షిపై ప్రభుత్వానికి ఎందుకంత కక్ష అని ప్రశ్నించారు. కూటమి సర్కారులో ఎవ్వరికీ రక్షణ లేకుండా పోయిందన్నారు.

అప్రజాస్వామికం..



వలిరెడ్డి శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పత్రికా స్వేచ్ఛను హరించడమే ధ్యేయంగా పని చేస్తోందని.. అందులోనూ ప్రధానంగా సాక్షి మీడియా, జర్నలిస్టులను వేధింపులకు గురి చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజల పక్షాన నిలిచి వార్తలు రాస్తున్న జర్నలిస్టులను వేధింపులకు గురి చేయడం అప్రజాస్వామికమన్నారు. కూటమి ప్రభుత్వం చర్యలు చూస్తుంటే బ్రిటీష్ పరిపాలన గుర్తుకొస్తోందన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

వేపాడ: మండలంలోని వల్లంపూడి గ్రామానికి చెందిన గోకేడ మహేష్‌పై అదే గ్రామానికి చెందిన ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వల్లంపూడి ఎస్సై సుదర్శన్ తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసులు శనివారం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.

గ్రామానికి చెందిన ఓ మహిళ పట్ల మహేష్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. అలాగే ఇంటి ఆవరణలో ఉన్న మొక్కలను చిందరవందర చేసి భయాందోళనలకు గురి చేశాడు. దీనిపై బాధిత మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పేదలకు వైద్యం దూరం చేయడమే చంద్రబాబు లక్ష్యం

- మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



చీపురుపల్లి: ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



వేపాడ: కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కడుబండి, తదితరులు



చీపురుపల్లి: మెట్టపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: రాష్ట్రంలోని పేద ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యంను దూరం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని ఆకులపేట, పిల్లపేట గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ సంతకాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసినప్పుడు కూడా ఒక్క ప్రభుత్వ మెడికల్ కళాశాల కూడా ఏర్పాటు చేయలేదన్నారు. జగన్ మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పరిపాలనలో 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేయడంతో పాటు ఐదు కళాశాలలు పూర్తి చేశారని చెప్పారు. అటువంటి ప్రైవేట్ కళాశాలలను కావాలనే కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌వారికి ధారాదత్తం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉంటే సూపర్ స్పెషాలిటీ వైద్యంతో పాటు పేద పిల్లలకు మెడికల్ సీట్లు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు గిరడ రాందాసు, ముల్లు పైడిరాజు, కొసిరెడ్డి రమణ, మీసాల సాయి, బూరాడ మహేష్, తలచుట్ల రాము, కరణపు ఆది, ఇజ్జిరోతు రమణ, సతివాడ అప్పారావు, ఆదికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సిగ్గుచేటు..

మెరకముడిదాం: పేద ప్రజలకు నాణ్యమైన, కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని దూరం చేయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌వీ రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని బిళ్లలవలస కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చందక గురునాయుడు, ఎంపీటీసీ సభ్యుడు మీసాల ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట: వేములాపల్లిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మెరకముడిదాం: బిళ్లలవలసలో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రేవళ్లపాలెం, గోపాలపల్లి గ్రామాల్లో..

శృంగవరపుకోట: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ మండలంలోని రేవళ్లపాలెం, గోపాలపల్లి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే, ఎస్.కోట నియోజకవర్గ కన్వీనర్ కడుబండి శ్రీనివాసరావు నేతృత్వంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేస్తే.. కూటమి సర్కారు వాటిని ప్రైవేట్‌పరం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.వెంకటలక్ష్మి, మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, వైస్ ఎంపీపీ పి.వెంకటరమణ, సోషల్ మీడియా అధ్యక్షుడు యడ్ల కిషోర్, యువజన విభాగం అధ్యక్షుడు వాకాడ సతీష్, పీఆర్ విభాగం అధ్యక్షుడు కె.వెంకటరావు, ఎస్సీ విభాగం అధ్యక్షుడు కె.జయశంకర్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు డి.శేఖర్, ఇతర నాయకులు వాకాడ రాంబాబు, చప్ప లత, తగరంపూడి రమణ, ఎం.యామినీదేవి, వసి బంగారునాయుడు, రంధి అనంత్, ఎల్.అప్పలసూర్యనారాయణ, ఎల్.వెంకటరావు, భాస్కర్, సీహెచ్ గణేష, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ, వల్లంపూడిలో..

వేపాడ: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాలను గవర్నర్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తిరుమలరాజు వర్మరాజు, పప్పల కృష్ణమూర్తి, పల్లి కృష్ణమూర్తి, సారిక తమ్మినాయుడు, బూర్లె సురేష్‌కుమార్, సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.అప్పారావు, మండల సర్పంచ్ సంఘ అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావుతో పాటు మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నేతలు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

చీపురుపల్లి: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో ప్రజలు భాగస్వాములు కావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని మెట్టపల్లిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.